సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



కట్టుదిట్టంగా పది పరీక్షలు

టెన్త్ పరీక్షలు కట్టుదిట్టంగా జరుగుతున్నట్టు జగనన్న విద్యా కానుక కిట్ల రాష్ట్ర పరిశీల కుడు ఎ.సుబ్బారావు అన్నారు. 8లో



గంజాయి ఆయిల్ స్వాధీనం

గంజాయి (ఆసీస్) ఆయిల్‌ను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు. 8లో



సారాబట్టీ ధ్వంసం

రాజవొమ్మంగి మండలం చీడిపాలెం అటవీ ప్రాంతంలో సారా బట్టీ, తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు.

రంజాన్ వేళలు

అరకు/పాడేరు:

ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
6-12	4-30

రంపచోడవరం:

ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
6-27	4-33

పాడేరులోనే రక్తమార్పిడి

గిరిజనుల ముంగిటకే వైద్యసేవలు అందిస్తున్న ప్రభుత్వం వారికి మరిన్ని ఆధునిక చికిత్సలు అందుబాటులోకి తెచ్చింది. సికిల్‌సెల్, తలసేమియా రోగులు వైద్యపరీక్షల నిమిత్తం గతంలో కేజీహెచ్‌కు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ గంటల తరబడి నిరీక్షణ. ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నం. పాడేరు జిల్లా ఆస్పత్రిలోనే ప్రత్యేక వార్డును ఏర్పాటుచేసి పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చింది.

- సికిల్‌సెల్, తలసేమియా రోగులకు బాసట
- జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు
- స్థానికంగానే సత్వర సేవలు



పాడేరు జిల్లా ఆస్పత్రిలోని సికిల్‌సెల్, తలసేమియా వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

సాక్షి, పాడేరు: గిరిజన ప్రాంతాల్లో పౌష్టికాహార లోపం, జన్యుపరమైన సమస్యల కారణంగా సికిల్‌సెల్, తలసేమియా ఎనీమియా ప్రభావం ఎక్కువగా ఉంది. వీటి నిర్ధారణ కోసం గిరిజనులు విశాఖ కేజీహెచ్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు పాడేరు జిల్లా ఆస్పత్రిలోనే వైద్యపరీక్షలు, ఉన్నత వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చింది. ఆయా వ్యాధుల లక్షణాలతో బాధపడుతున్న చిన్నారులను జిల్లా ఆస్పత్రిలోని ప్రత్యేక విభాగంలో రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ తరువాత వైద్యసేవలు కల్పిస్తున్నారు. ధ్రువపత్రాలు పంపిణీ చేయడం వల్ల వ్యాధిగ్రస్తులు ప్రభుత్వం నుంచి నెలకు రూ.10 వేల పింఛను పొందుతున్నారు.

ల్యాబ్, ప్రత్యేక వార్డు..

పాడేరు జిల్లా ఆస్పత్రిలో రెండు నెలల క్రితం వ్యాధుల నిర్ధారణకు గాను రూ.20 లక్షలతో హెచ్‌పీఎల్‌సీ ల్యాబ్, ప్రత్యేక వార్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది.

- ఇక్కడ ల్యాబ్ అందుబాటులోకి వచ్చిన రెండు నెలల కాల వ్యవధిలో 298మంది బాలబాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 15 మందికి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి ఉన్నట్టుగా గుర్తించారు. వీరందరికీ ఇక్కడ వైద్యవిభాగంలోనే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు.



- వీరికి నెలకు రూ.10 వేల పింఛను సౌకర్యం కల్పించేందుకు ధ్రువపత్రాల జారీకి వైద్యారోగ్యశాఖ ప్రభుత్వానికి నివేదిక పంపింది.

జిల్లా ఆస్పత్రిలో పరీక్షలతో మేలు



కేజీహెచ్‌లో గతంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిగేవి.వైద్యం కోసం కూడా బాధితులు అంత దూరం వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. నాబిడ్డకు సికిల్‌సెల్ ఎనీమియా ఉంది. ఈ కేసులకు సత్వర వైద్యంతో పాటు రక్తం అవసరాలు అధికంగా ఉంటాయి. పాడేరు జిల్లా ఆస్పత్రిలో పరీక్షల విభాగంతో పాటు ప్రత్యేక వార్డును ప్రభుత్వం ఏర్పాటు చేసి ఎంతో న్యాయం చేసింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– జలియా ఆనందరావు, బాధితుడి తండ్రి, హుకుంపేట

తప్పిన వ్యయ ప్రయాసలు

- **వైద్యసేవలకోసం వారు ఎన్నో వ్యయప్రయాసలకు గురయ్యేవారు. దూరాభారం కావడంతో కేజీహెచ్‌కు వెళ్లేందుకు ఆసక్తి చూపేవారు కాదు. సికిల్‌సెల్, తలసేమియా ఎనీమియా రోగులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆపద్బాంధవుడిలా ఆదుకున్నారు. వారికి** వైద్యసేవలు స్థానికంగా అందుబాటులోకి తెచ్చారు.
- గిరిజన ప్రాంతాల్లో ఐదు నుంచి 16 ఏళ్లలోపు వారిలో సికిల్‌సెల్, తలసేమియా ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ సమస్యను గుర్తించిన జగన్‌మోహన్ రెడ్డి వారికి రూ.10 వేల పింఛను సౌకర్యం కల్పించి బాసటగా నిలిచారు.
- హెచ్‌బీ శాతం తక్కువగా ఉండి, చాతీతో పాటు, కాళ్లు, చేతులు నొప్పి పుట్టడం, తరచూ అనారోగ్య సమస్యలతో బాధపడే వారిలో సికిల్‌సెల్, తలసేమియా వ్యాధుల ప్రభావం ఉంటోందని వైద్యులు చెబుతున్నారు.

సకాలంలో వైద్య పరీక్షలు



సికిల్‌సెల్, తలసేమియా కేసులకు వైద్యపరీక్షలు, వైద్యసేవలు పాడేరు జిల్లా ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. వ్యాధి లక్షణాలు ఉన్న బాలబాలికలను వైద్యబృందాలు, ఉపాధ్యాయులు గుర్తించి జిల్లా ఆస్పత్రికి తీసుకువస్తున్నారు. వీరిని తొలుత ఆస్పత్రిలోనే ఉంచి పూర్తిస్థాయిలో వైద్యపరీక్షలు జరుపుతున్నాం.రక్తనమునాలను హెచ్‌పీఎల్‌సీ ల్యాబ్‌లో సమగ్రంగా పరీక్షలు జరిపిన తరువాత వ్యాధి నిర్ధారణ నివేదికను ప్రభుత్వానికి పంపుతున్నాం.

– డాక్టర్ శంకర్‌ప్రసాద్, జిల్లా సమన్వయకర్త, వైద్యవిధాన పరిషత్

ఎస్పీగా తుహిన్ సిన్హా

- సతీష్‌కుమార్‌కు కాకినాడ ఎస్పీగా బదిలీ



తుహిన్ సిన్హా



సతీష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా ఎస్పీగా పాడేరు ఏఎస్పీ అడ్మిన్‌గా పనిచేస్తున్న తుహిన్ సిన్హాను ప్రభుత్వం నియమించింది. ఇక్కడి ఎస్పీ సతీష్ కుమార్‌ను కాకినాడ ఎస్పీగా బదిలీ చేసింది. కొత్త ఎస్పీ తుహిన్ సిన్హా పాడేరు ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ అడ్మిన్‌గా ఏడాదిగా పనిచేస్తున్నారు. ఆయనకు మంచి పోలీసు అధికారిగా గుర్తింపు ఉంది. ఇంతవరకు ఇక్కడ ఎస్పీగా విధులు నిర్వహించిన సతీష్‌కుమార్‌కు విధుల నిర్వహణలో మంచి పేరుంది. చింతపల్లి ఏఎస్పీగా, నర్సీపట్నం ఓఎస్డీగా, పాడేరు ఎస్పీగా సుదీర్ఘకాలం పాటు పనిచేశారు. మావోయిస్టు కార్యకలపాల నిరోధానికి ఎంతో శ్రమించారు. మావోయిస్టుల ప్రాబల్యం తగ్గుముఖం పట్టడంలో కీలకంగా వ్యవహరించారు. గంజాయి సాగు నిర్మూలన,గంజాయి అక్రమ రవాణా అడ్డుకట్ట వేయడంలోను సమర్థవంతంగా సేవలందించారు. ఆయన హయాంలో ఏవోబీ వ్యాప్తంగా మావోయిస్టుల డంపుల స్వాధీనం, కీలక మావోయిస్టు నేతలు, మిలీషియా సభ్యుల అరెస్ట్, లొంగుబాట్లు భారీగానే చోటుచేసుకున్నాయి. వరదల సమయంలో పోలవరం ముంపు గ్రామాల్లో సహాయ కార్యక్రమాలకు ఎంతో శ్రమించారు. ముంపు గ్రామాలకు బోట్లు, లాంచీలపై ప్రయాణించి, వరద బాధితులకు బాసటగా నిలిచారు. ఆయన నేతృత్వంలో పోలీసు యంత్రాంగం సేవలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, హోంమంత్రి తానేటి వనిత అభినందించారు.

న్యూస్‌రీల్

నేడు స్వాత్మానందేంద్ర స్వామి పర్యటన



సాక్షి,పాడేరు: విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి ఆదివారం పాడేరు, హుకుంపేట మండలాల్లో పర్యటించనున్నారు. హుకుంపేట మండలంలోని తడిగిరి పంచాయతీ, ఉక్కుర్భ గ్రామంలోని స్వయంభూ భీమలింగేశ్వరస్వామి ఆలయం వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు.ఉదయం 8.30గంటలకు పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు.అనంతరం 9గంటలకు ఉక్కుర్భ గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

శ్రీనివాసునికి ప్రత్యేక పూజాదికాలు

అడ్డతీగల: అడ్డతీగల శివారు అనిగేరు రోడ్‌లోని శ్రీ నాగలింగేశ్వర క్షేత్రంలో కొలువైన శ్రీనివాసునికి శనివారం ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు.తొలిత స్వామి వారికి పంచద్రవ్యాలతో అభిషేకం జరిపించారు. పుష్పాలతో అలంకరించి గోవిందనామాలతో స్మరిస్తూ పూజలు చేశారు. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.పూజలు చేసిన అనంతరం అన్నదానం ఏర్పాటుచేశారు.

చికిత్స పొందుతూ గిరిజనుడి మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

రాజవొమ్మంగి: గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు యత్నించిన గిరిజనుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని అమ్మిరేఖల గ్రామానికి చెందిన గిరిజనుడు వెల్లెం వెంకటేశ్వర్లు అలియాస్ పండు (34) ఈనెల 6 వతేదీన ఇంటివద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం ఇక్కడినుంచి అతనిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం రాత్రి ఆస్పత్రిలో మృతి చెందినట్టు ఎస్‌ఐ గోపీనరేంద్రప్రసాద్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు ఈశ్వర రెడ్డి రంపచోడవరం గురుకుల పాఠశాలల్లో టెన్త్ చదువుతున్నాడు. ప్రస్తుతం పరీక్షలు రాస్తున్న ఈశ్వరరెడ్డి తండ్రి మరణవార్త తెలిసిన వెంటనే స్వగ్రామానికి వచ్చాడు.

తల్లీకొడుకుల అదృశ్యం

కొయ్యూరు: మండలంలో బాలారానికి చెందిన తల్లీకొడుకులు అదృశ్యమైనట్టు స్థానిక ఎస్‌ఐ రాజారావు శనివారం తెలిపారు. గతనెల 31న బాలారానికి చెందిన జి. లోవతల్లి,ఆమె కొడుకు వీర వెంకట ప్రకాష్ అదృశ్యమయ్యారని తెలిపారు. లోవతల్లి భర్త సత్తిబాబు,పెద్ద కొడుకు దుర్గ మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

జగన్ నాయకత్వంలోనే గిరి సంక్షేమం

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- 'జగనన్నేమా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' నిర్వహణ
- ప్రజల నుంచి విశేష స్పందన



వంట్లమామిడి గ్రామంలో పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: మహానేత డాక్టర్ వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే గిరిజనుల సంక్షేమం సాధ్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని వంట్లమామిడి పంచాయతీ పరిధి వంజపర్తి, మెట్టూరు, గుంజుగెడ్డ, వంట్లమామిడి, 12వమైలురాయి, ఇసుకలగొంది, కుమ్మరితోం, పూలబంద, చింతాడ గ్రామాల్లో శనివారం జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంతో పాటు,గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు, ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు,ఇతర నేతలు 280 గడపలను సందర్శించారు. ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన నవరత్నాల పథకాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను ఆయా గిరిజనులకు సమగ్రంగా వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. గిరిజనుల నివాసాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్‌ను అంటించుకునేందుకు వారంతా పోటీపడ్డారు. లబ్ధిదారులు 8296082960 నంబర్‌కు ఫోన్ చేసి మిస్డ్‌కాల్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సైఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్నే గిరిజనులు కోరుకోవడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా వ్యవసాయ మండలి అధ్యక్షురాలు ఎరస్వతి, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర, ఎంపీటీసీలు చిప్పాడ మీనా, నరసింహమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేని ప్రతిపక్షాలు

- ప్రజల గుణపాఠం తప్పదు
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



అరకులోయలోని సి-కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా పేద ప్రజల సంక్షేమానికి వినూత్న కార్యక్రమాలు అమలుజేస్తున్నారని, అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని శనివారం పెదలబుడు పంచాయతీ పరిధిలో అరకులోయ బికాలనీ, సీకాలనీలో 94 నివాసాలను సందర్శించారు. జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే, గృహసారధులు, వలంటీర్లకు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు సమగ్రంగా వివరించారు. వారి ఆమోదంతో ఇంటి తలుపులపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలతో కూడిన స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలోనే పేదప్రజల భవిష్యత్తు సాధ్యమన్నారు. వారి సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్న సీఎంగా దేశంలోనే గుర్తింపు ఏర్పడిందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన సమయం నుంచి అరకులోయ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో రోడ్లు, తాగునీరు,ఇతర మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింగరావు, సచివాలయాల కన్వీనర్లు గులాబి, త్రినాథ్, శివ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరి, పార్టీ నేతలు రఘునాథ్, సత్యానందం, బాలరాజు పాల్గొన్నారు.

జ్ఞానసాగర్ సత్యనారాయణ ఇకలేరు

- అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి
- నేడు పాడేరులో అంత్యక్రియలు
- ఆధ్యాత్మిక గురువుగా సుపరిచితులు



సత్యనారాయణ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న బ్రహ్మకుమారీలు, ఆధ్యాత్మిక కమిటీల ప్రతినిధులు



సత్యనారాయణ (ఫైల్)

సాక్షి, పాడేరు: ఉమ్మడి విజయనగరం, విశాఖ జిల్లాల్లోని పార్వతీపురం, పాడేరు గిరిజన ప్రాంతాల్లో జ్ఞానసాగర్ స్వచ్ఛంద సంస్థ, బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాఖల వ్యవస్థాపకుడు డీవీ సత్యనారాయణ అలియాస్ బాబ్జి (63) శనివారం మృతిచెందారు. కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని స్టార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్య పరిస్థితి బ్రెయిన్‌డెడ్‌కు చేరడంతో తుదిశ్వాస విడిచినట్టు వైద్యులు నిర్ధారించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనంలో ఆయన భౌతికకాయాన్ని పాడేరులోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం రాజయోగ ధ్యాన కేంద్రానికి సాయంత్రం తీసుకువచ్చారు. తాడేపల్లిగూడెంకు చెందిన సత్యనారాయణ గత 20 ఏళ్ల నుంచి గిరిజన ప్రాంత ప్రజలకు సుపరిచితులు. ఆధ్యాత్మిక, గిరిజన సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఆయనకు గిరిజన ప్రాంతాల్లో మంచి గుర్తింపు ఉంది. ఆయన మృతి పట్ల పాడేరు, హుకుంపేట మండలాల్లోని ఆధ్యాత్మిక కమిటీలు, రాజయోగ ధ్యాన కేంద్రం ప్రతినిధులు, బ్రహ్మకుమారీలు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయులు, పాడేరు వర్తక సంఘం ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివారం ఉదయం పాడేరులో అంత్యక్రియలు నిర్వహించేందుకు బ్రహ్మకుమారీలు ఏర్పాట్లు చేస్తున్నారు.

గర్భిణి ప్రసవ వేదన

- అంబులెన్సు అందుబాటులో లేక అవస్థలు
- ప్రైవేట్ వాహనంలో తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రసవం



గర్భిణి చిన్ని

జి.మాడుగుల: పురిటి నొప్పులతో ఓ గర్భిణి సకాలంలో అంబులెన్సు రాకపోవడంతో నానా అవస్థలు పడింది. మండలంలోని బొయితిలి పంచాయతీ సూరిమెట్ట గ్రామానికి చెందిన లంబూరి చిన్నికి శనివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. అయితే అంబులెన్సు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వాహనంలో స్థానిక పీహెచ్‌సీకి తీసుకువస్తుండగా మార్గం మధ్యలో వనెల్బ గ్రామ సమీపంలో ప్రసవించింది. ఆశా వర్కర్ బంగారమ్మ, అంగన్‌వాడీ టీచర్ సత్యవతి ప్రసవం చేశారు. ఆమె మగశిశువు జన్మనిచ్చింది. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో చేర్పించారు. తల్లీబిడ్డలు క్షేమంగానే ఉన్నారని వైద్యసిబ్బంది తెలిపారు.

కొత్తపాలం రోడ్డు పనులు ప్రారంభం

ప్రారంభించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



కొత్తపాలం రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: మండలంలోని వంట్లమామిడి పంచాయతీలోని చౌడుపల్లి నుంచి మారుమూల కొత్తపాలం గ్రామానికి రూ.కోటితో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులను శనివారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తపాలంకు రోడ్డు నిర్మాణం పూర్తయితే జోడూరు,గొప్పూరు.ఒంటిపాక గ్రామాలకు రహదారి సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణాలు చేపట్టి రవాణా సౌకర్యాలు మెరుగుపరుస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, జిల్లా వ్యవసాయ సలహ మండలి అధ్యక్షురాలు సరస్వతి, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, సర్పంచ్ పాంగి రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

జి.మాడుగుల: మండలంలో సొలభం-జి.మాడుగుల మార్గంలో ప్రయాణికులతో వస్తున్న ఆటో అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో మహిళ మృతి చెందగా ఐదుగురికి గాయాలయ్యాయి. జి.మాడుగుల పంచాయతీ వైబీ గొందూరు గ్రామానికి చెందిన కొంతమంది శనివారం సాయంత్రం కె.కోడాపల్లి గ్రామంలో శుభకార్యానికి ఆటోలో బయలుదేరారు. మార్గం మధ్యలో బాలుర ఆశ్రమోన్నత పాఠశాల సమీపంలోకి వచ్చేసరికి కల్వర్టు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వైబీ గొందూరు గ్రామానికి చెందిన తుర్రే మత్యరంబ (18) తీవ్రంగా గాయపడింది. ఆటోలో ఉన్న టి.వరహాలమ్మ, టి.నూకాలమ్మ, ఎస్.చిన్నతల్లి, విజయకుమారి, టి.చంద్రమ్మ గాయపడ్డారు. వీరిని అంబులెన్సులో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ మత్యరంబ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

గంజాయి ఆయిల్ స్వాధీనం

● వ్యక్తి అరెస్టు

జి.మాడుగుల: గంజాయి (ఆసీస్) ఆయిల్‌ను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కోరాపల్లికి చెందిన పాంగి కృష్ణ బొలెరో వాహనంలో 8 కిలోల గంజాయి ఆయిల్‌ను మైదాన ప్రాంతాలకు తరలిస్తుండగా జి.మాడుగులలో పట్టుకున్నట్టు ఆయన వివరించారు. అతనిని నుంచి ఆయిల్ తయారుచేసే మెషీన్‌ను, గంజాయి ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని బొలెరో వాహనాన్ని సీజ్ చేశామని చెప్పారు. నిందితుడు కృష్ణను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించనట్టు సీఐ పేర్కొన్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

చీడిపాలెంలో ఏరియా డామినేషన్

రాజవొమ్మంగి : మండలంలోని గడుఓకుర్తి పంచాయతీ చీడిపాలెం గ్రామంలో జడ్డంగి ఎస్‌ఐ షరీఫ్ ఆధ్వర్యంలో శనివారం ఏరియా డామినేషన్ ఆపరేషన్ నిర్వహించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయా, కొత్త వ్యక్తులు సంచరిస్తున్నారా అన్న అంశాలు పరిశీలించారు. పాడుబడిన భవనాలు, కల్వర్టుల వద్ద తనిఖీలు నిర్వహించి, ఊరికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో కూంబింగ్ జరిపారు.

రూ.1.50 లక్షల చోరీ

అనకాపల్లి టౌన్: కొండుపాలెంలో గొల్లవిల్లి అప్పలరాజు ఇంట్లో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు రూ.1.50 లక్షలు చోరీ చేశారు. గ్రామీణ ఎస్‌ఐ సీహెచ్.నరసింగరావు వివరాల ప్రకారం.. అప్పలరాజు రోజు మాదిరిగానే పొలం పనులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరచి ఉంది. ఇటీవల సరుగుడు తోట అమ్మిన సొమ్ము అందులో లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు.

మూడు టేకు దుంగలు పట్టివేత

గొలుగొండ: కృష్ణాదేవిపేట రేంజ్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న మూడు టేకు దుంగలను అటవీశాఖ సిబ్బంది శనివారం పట్టుకున్నారు. మండలంలోని పల్లావూరులో రైతు తన పొలంలో చెట్లను కొట్టి అనుమతులు లేకుండా ఇంటికి తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటికి అటవీ, రెవెన్యూ శాఖ అనుమతులు లేకపోవడంతో గొలుగొండ కలప డిపోకు తరలించారు.

ఏయూ తోటలో 'విదేశీ' సాగు

● ఖాళీ సమయంలో వ్యవసాయం చేస్తున్న వియత్నాం విద్యార్థులు
● ఆకుకూరలు, ఔషధ మొక్కల పెంపకం

ఏయూక్యాంపస్: విభిన్న సంస్కృతి, సంప్రదాయాల సమాహారం ఆంధ్ర విశ్వ విద్యాలయం. విద్యనభ్యసించడానికి పలు దేశాల నుంచి విద్యార్థులు తరలిరావడంతో మినీ ప్రపంచమే ఇక్కడ కనిపిస్తుంది. విదేశీ విద్యార్థులు చదువుతో పాటు వ్యవసాయం చేస్తూ.. ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా వియత్నాం దేశానికి చెందిన విద్యార్థులు వివిధ రకాల ఆకుకూరలు, ఔషధ మొక్కలు పెంచుతూ.. హాస్టల్ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆహ్లాదం, ఆరోగ్యం పంచే మొక్కల పెంపకాన్ని వీరంతా అలవాటుగా మార్చుకున్నారు. ఏయూలో వియత్నాం దేశానికి చెందిన విద్యార్థులు పీజీ, పీహెచ్‌డీ కోర్సులు అభ్యసిస్తున్నారు. వీరంతా ఎంవీపీ కాలనీలోని అంతర్జాతీయ విద్యార్థుల వసతిగృహంలో ఉంటున్నారు. ఆ దేశ విద్యార్థులు బౌద్ధ మతాన్ని ఆచరిస్తూ.. శాఖాహారులుగా జీవనం సాగిస్తున్నారు. ఉదయం 9 గంటల సమయంలో సూప్, సలాడ్, రైస్ వంటివి తీసుకుంటారు. మధ్యాహ్నం పండ్లు ఆహారంగా స్వీకరిస్తారు. సాయంత్రం 6–7 గంటల సమయంలో సాత్విక ఆహారాన్ని తీసుకోవడం వీరి దినచర్యలో భాగం. కొన్ని సమయాల్లో బ్రెడ్, ఫ్రైడ్‌నూడిల్స్, పాలు, పన్నీర్ కూడా తీసుకుంటారు. తమ ఆహారంలో వినియోగించే వాము ఆకు, మిరప, ఉల్లి, బొప్పాయి, లెమన్ గ్రాస్‌తో పాటు వియత్నాంకు చెందిన జపనీస్ లేతూస్, బొంగాన్, కటుక్, తాయి బాసిల్, తియ్య దుంపలు(ఎర్ర దుంపలు) వంటివి ఇక్కడ పండిస్తున్నారు. ఎర్రదుంపల ఆకులు, లెమన్ గ్రాస్, జపనీస్ లేతూస్ ,బొంగాన్ ఆకులను సూప్‌ల తయారీకి వినియోగిస్తున్నారు. తమలపాకును పోలి ఉండే బొంగాన్ ఆకుల్లో ఆహారం ఉంచి ఉడికించడం వల్ల మంచి వాసన వస్తుందని విద్యార్థులు చెబుతున్నారు.


తోట పని చేస్తున్న వియత్నాం విద్యార్థులు


హాస్టల్ గదుల వద్ద పెంచుతున్న మొక్కలు

హాస్టల్..హరితమయం : వియత్నంలో సాగుచేసే పలు రకాల ఆహార, ఔషధ మొక్కలను తమతో పాటే తీసుకొస్తున్నారు. మొదట్లో కుండీల్లో పెంపకం చేపట్టారు. తర్వాత హాస్టల్ అధికారుల సహకారంతో వసతి గృహ ప్రాంగణంలో సాగుచేయడం ప్రారంభించారు. నీరుపోయడం, కలుపుతీయడంవీరినిత్యకృత్యంలో భాగంగా మారిపోయింది. ప్రకృతికి దగ్గరగా ఉండటం, శాఖాహారం తీసుకోవడం, సేంద్రియవిధానంలో ఆకుకూరలు పండించడం తమకుఆనందానిస్తోందని విద్యార్థులు చెబుతున్నారు. అలాగే తమ గదుల వద్ద కూడా మనీప్లాంట్, స్నేక్ ప్లాంట్‌తో పాటు వివిధ అలంకరణ మొక్కలను పెంచుతూ హరితమయంగా తీర్చిదిద్దారు.

ప్రకృతితో కలిసి జీవించాలి



ప్రకృతికి దగ్గరగా, ప్రకృతితో మమేకమై జీవించడం అలవాటు చేసుకోవాలి. మేము పూర్తిగా శాకాహారం తీసుకుంటాం . ఖాళీ సమయంలో హాస్టల్ ప్రాంగణంలో ఆకుకూరలు పండిస్తున్నాం. ఇందులో ఔషధ మొక్కలు కూడా ఉన్నాయి. వీటితో సలాడ్, సూప్ వంటివి తయారు చేసుకుంటాం.

– వో థి హా, వియత్నాం పరిశోధకురాలు

వాతావరణంలో సారూప్యత



భారత్, వియత్నాం దేశాల మధ్య వాతావరణంలో సారూప్యత ఉంది. వియత్నాంలోని సైగాన్ నగరం దాదాపుగా విశాఖను పోలి ఉంటుంది. దీంతో మాకు ఇక్కడ ఉండటం సులభమైంది. ప్రజలకు కూడా మంచి స్నేహభావంతో మెలుగుతారు. కొన్ని మొక్కలను వియత్నాం నుంచి ఇక్కడకు తీసుకొచ్చి పెంచుతున్నాం.

– లాన్, వియత్నాం పరిశోధకురాలు

నిజాయితీగా జీవిస్తారు



భారతీయ ప్రజలు నిజాయితీగా జీవిస్తారు. హాస్టల్‌లో వసతి, సహకారం చాలా బాగున్నాయి. ఇక్కడ కూడా చాలా మంది శాఖాహారం తీసుకోవడం చూస్తున్నాం. వియత్నాంలో పండిచే పలు రకాల మొక్కలను తీసుకువచ్చి ఇక్కడ పెంచే ప్రయత్నం చేస్తున్నాం.

– డిన్, జర్నలిజం పీజీ విద్యార్థిని

రెండు ఆటోలు ఢీ - 16 మందికి గాయాలు

చింతూరు: మండల కేంద్రంలోని శబరినది వంతెనపై రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో 16 మందికి గాయాలయ్యాయి. స్థానిక బీసీ కాలనీకి చెందిన 14 మంది మిరప కాయలు కోసేందుకు కూలి నిమిత్తం కూనవరం వెళ్లి తిరిగి ఆటోలో వస్తుండగా వంతెనపై ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ ఆటో బలంగా ఢీకొంది. ఈ ఘటనలో రెండు ఆటోల డ్రైవర్లతో పాటు కూలీలకు గాయాలు కావడంతో వారిని 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయాలైన వారిలో సూర్యాకుల రమేష్, కోట్ల హర్షవర్ధన్, నవ్వులూరి వెంకట్ పరిస్థితి విషమంగా ఉండడంతో భద్రాచలం తరలించారు. ఈ ప్రమాదంలో బీసీ కాలనీకి చెందిన కుర్సం కుమారి, సూర్యాకుల పోశమ్మ, మడకం నాగమణి, మడకం అచ్చమ్మ, సూర్యాకుల వరలక్ష్మి, సక్కుడి సుధ, మడకం రాములమ్మ, రవ్వా కృష్ణమ్మ, మడకం సుబ్బారావు, పట్టాబత్తుల రమణమ్మ, ఎర్రం మహాలక్ష్మి, ఇందిర, భద్రమ్మలకు కూడా గాయాలయ్యాయి. మరోవైపు గాయపడిన తమ కుటుంబ సభ్యులను చూసేందుకు ఏరియా ఆస్పత్రికి వస్తున్న క్రమంలో స్థానిక గురుకుల పాఠశాల ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో యోహాన్, దిలీప్‌కుమార్ అనే ఇద్దరు యువకులు గాయపడ్డారు.


సంఘటన స్థలంలో పడిఉన్న క్షతగాత్రులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

కట్టుదిట్టంగా పది పరీక్షలు

జేవీకే పరిశీలకులు సుబ్బారావు

పెదబయలు: పదో తరగతి పరీక్షలు కట్టుదిట్టంగా జరుగుతున్నట్టు జగనన్న విద్యా కానుక కిట్ల రాష్ట్ర పరిశీలకులు ఎ.సుబ్బారావు అన్నారు. పెదబయలు మండలం కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల–1, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. అన్ని గదుల్లోకి వెళ్లి పరిశీలించారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. మాస్‌కాపీయింగ్‌కు తావు లేకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. అనంతరం స్థానిక గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల–1లోని జేవీకే కిట్ల గోదాంను పరిశీలించారు. గదుల్లో లైటింగ్,తలుపులు,కిటికీలు,మంచి ఫ్లోరింగ్ ఉండడంతో మండల అధికారులను,పాఠశాల హెచ్ఎంను అభినందించారు. కిట్ల నిల్వపై ప్రతి మండలంలో విద్యాశాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఈవో కొరవంగి సింహాచలం, ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, వెలుగు ఏపీఎం ఈశ్వరబాబు నాయుడు, పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'వాకపల్లి' తీర్పునకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

మావోయిస్టు పార్టీ ఆంధ్ర ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్

పాడేరు రూరల్: వాకపల్లి మహిళలపై లైంగికదాడికి పాల్పడిన పోలీసులను నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ఉద్యమించాలని మావోయిస్టు పార్టీ ఆంధ్రా–ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పాడేరులో విలేకరులకు ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారులు సరైన ఆధారాలు చూపించలేకపోవడంతో ఈ కేసు కొట్టేస్తున్నట్టు కోర్టు ప్రకటించందని పేర్కొన్నారు. ఇది సరికాదన్నారు. విచారణ నివేదిక రాకపోతే మళ్లీ విచారణకు కోర్టు ఎందుకు ప్రభుత్వాన్ని ఆదేశించలేదన్నారు. జల్ జంగిల్ జమిన్ అధికారం కోసం పోరాడుతున్న వారు కనుక కోర్టు తీర్పు కూడా ఆదివాసీలకు అనుకూలంగా ఇవ్వలేదన్నారు. వాకపల్లి ఆదివాసీ మహిళలపై లైంగికదాడి కేసులో కోర్టు తీర్పును ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. న్యాయం కోసం పోరాడుతున్న ఆదివాసీలకు అండగా నిలవాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామికవాదులు, ప్రగతిశీల శక్తులు, విద్యార్థులు, మేధావులు, మహిళలు, హక్కుల సంఘాలు, ఆదివాసీలు సంఘటితమై బలమైన క్రియాశీలక ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు.


మావోయిస్టులు విడుదల చేసిన లేఖ

ఎ. కొత్తపల్లిలో కోళ్ల ఫారం దగ్ధం

రూ. 10 లక్షల మేర ఆస్తి నష్టం

దేవరాపల్లి: మండలంలోని ఎ. కొత్తపల్లిలో సంభవించిన అగ్ని ప్రమాదంలో కోళ్ల ఫారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన గోకాడ ప్రసాద్ తాటాకుల షెడ్‌లో శుక్రవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో కోళ్ల ఫారం షెడ్ పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక దళం చేరుకున్నప్పటికి అప్పటికే షెడ్ పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనతో రూ. 10 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు లబోదిబోమన్నారు. షెడ్‌తోపాటు కోళ్ల మేత కోసం బకెట్లు, ఇతరత్రా సామగ్రి కాలి బూడిదయ్యాయని వాపోయారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియరావడం లేదు.

డిప్యూటీ సీఎం బూడి పరామర్శ...

అగ్ని ప్రమాదంలో దగ్ధమైన కోళ్ల ఫారాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. ఈయన వెంట సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, కె.ఎం. పాలెం సర్పంచ్ గంధం రామకృష్ణ ఉన్నారు.


కోళ్ల ఫారం షెడ్డును పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు